# రక్తాశ్రువు

## కుమారి. ఎ. వి. శేషారత్నం

డాక్టర్ పరాంకుశంగారి నర్సింగ్‌హోం-

రాత్రి తొమ్మిదవుతోంది అప్పటిదాకా పేషంట్లతో కిటకిటలాడుతున్న నర్సింగ్‌హోమ్‌లో అవుట్ పేషంట్లు ఇక ఒకరో ఇద్దరో ఉన్నారు.

జోగయ్య బల్లమీద కూర్చుని రెండు చేతులూ కళ్ల కడ్డం పెట్టుకున్నాడు. 'ఇంకా ఇద్దరు' అనుకున్నాడు.

'నాన్నా!'- చిన్నిగాడి గొంతు క్రోధంగా ఉరుముతున్నట్టుంది.

ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు. ఎవరూ లేరు

"రూపాయిలకి నన్ను అమ్మేసావా నాన్నా"-చిన్నిగాడు మళ్లీ మూసుకున్న కళ్లముందు ప్రత్యక్షమై నిలదీసి అడుగుతున్నాడు.

ఎంత మర్చిపోదామన్నా మధ్యాహ్నం సంఘటన మరపుకి రావడంలేదు జోగయ్యకు.

రచ్చబండ దగ్గర పది గంటలకు మొదలైన పేకాట పన్నెండయేసరికి ఊపు అందుకుంది.

'అరువు ఆటలు లేవు జోగయ్యా'- గుర్నాథం అప్పుడే వచ్చిన జోగయ్యను ఎక్కిరింపుగా అన్నాడు.

'పోరా పక్కి నిన్నగాక మొన్న పేక ముక్క పట్టిన నువ్వు జోగయ్యలాంటి పెద్ద హోందును నిలదీసెంతవాడవయ్యావేం- వాడి మాటలకేం గాని రా కూర్చో జోగయ్యా! నీ పెట్టుబడి నేను పెడతాను '

ఊరి పెద్ద రాఘవులు జోగయ్యను చెయ్యి పట్టి చనువుగా కూర్చోబెట్టాడు. గుర్నాథం మొహం మాడ్చుకున్నాడు.

'ఒరే చిన్నిగా అందరికీ టీలు తెచ్చి పెట్టరా - గుర్నాథం! నీకు ఎగరెట్లు కావాలా' - జోగయ్య మాటలకి గుర్నాథం ఏం మాట్లాడలేకపోయాడు.

చిన్నిగాడు డబ్బులు తీసుకుని పరిగెత్తాడు.

మరో గంట గడిచేసరికి జోగయ్య రెండు వందలు బాకీపడ్డాడు రాఘవులికి

'నీ మనసేం బాగులేనట్టుంది జోగయ్యా అలా చూస్తూ కూర్చోకూడదమా' మృదువుగా అన్నాడు రాఘవులు.

'ఒంట్లో ఎలా వుంది కడుపులో నొప్పి తగ్గిందా?' డాక్టరేమన్నాడు. నిన్న పట్నం వెళ్లినట్టున్నావు-రామచంద్రం అడిగాడు

'ఆపరేషన్ చెయ్యాలన్నాడు భద్రం. లేకపోతే ఈ నొప్పి తగ్గదట' దిగులుగా ఉంది జోగయ్య గొంతు

'ఏంటో మా లక్ష్మి పోయినచగ్గర్నుంచే బొత్తిగా పాడయిపోయావు కుర్రాడిని చూసైనా కాస్త మనసు దిటవు చేసుకోవాలి జోగయ్యా'-ఊరి కరణం సానుభూతిగా అన్నాడు.

'ఆపరేషన్‌కి మూడు వేలవుతుందిట.'

జోగయ్య మాటలకి ఎవరూ సమాధానం చెప్పలేదు ఇల్లూ, వాకిలీ, భూమి, పుత్రా లేని అతనికి అంత డబ్బు అప్పిచ్చే సాహసం ఎవరికి లేదు.

పేక ముక్కలు కింద పడేసాడు జోగయ్య.

'ఆటకేంగాని చిన్నిగాడిని అమ్మేద్దాం అనుకుంటున్నాను'

పక్కలో బాంబు పేలినట్టు ఉలిక్కిపడ్డారందరూ. టీలు తీసుకొచ్చిన చిన్నిగాడి ఎనిమిదేళ్ల బుర్రకి తండ్రి అన్నదేమిటో ఒక్క క్షణం అర్థం కాకపోయినా ఎందుకో భయపడ్డాడు.

'నాన్నా' అన్నాడు మేకపిల్లలా.

'ఒంట్లోనే కాకుండా, నీకు మనసులో కూడ బాగా అనారోగ్యంగా ఉన్నట్టుంది జోగయ్యా లేకపోతే చేతికందివచ్చే కుర్రాడిని అమ్ముతా ననడమేమిటి?'-రాఘవులు కసిరాడు.

'నువ్వన్నమాట నిజమే అయితే నా పాట రెండు వందల ఏభై'- గుర్నాథం వెక్కిరింపుగా అన్నాడు. ఎందుకో జోగయ్యంటే మొదట్నుంచి బాగా చిన్న చూపు అతనికి

'చాల్లేండ్రా ఏదో జోగయ్య తెలివి తక్కువగా మాట్లాడత మేమిటి మనం పై అనడ మేమిటి'- భద్రం అన్నాడు అనుమానంగా.

'లేదు. నేను నిజంగానే చెబుతున్నాను. ఇక్కడ కాకపోతే పట్నంలోనైనా రేపు అమ్మేస్తాను.'

జోగయ్య మాటలతో అందరికీ అనుమానం తీరిపోయింది.

'అయితే నా పాట నాలుగు వందలు'- ఎవరో అన్నారు.

'నాది అయిదు వందలు'-ఎర్రగా కళకళ్లాడుతున్న చిన్నిగాడి ముఖం వైపు చూస్తూ అన్నాడు గురువులు.

చిన్ని బిత్తరపోయాడు. మళ్లీ 'నాన్నా' అన్నాడు.

'అలా పిలవకురా చిన్ని! నిన్నిపుడు ఎవరు కొనుక్కుంటే వాళ్లే మీ నాన్న'- మొహం తిప్పుకున్నాడు

'నా పాట ఏడు వందలు'-

క్రమంగా అందరిలో కుతూహలం హెచ్చింది. పెద్ద గుంపు పోగయింది రచ్చబండ దగ్గర.

రాఘవులు మనస ట్టుడికినట్టుడిగిపోతోంది.

'ఆగండి. నేనీ ఊరి పెద్దను. ఎవరూ నోరెత్తకండి. నా పాట మూడు వేలు. చిన్నిని నేను కొనుక్కుంటున్నాను'-అన్నాడు గంభీరంగా అతను.

మరెవ్వరూ నోరెత్తలేకపోయారు. జోగయ్య తువ్వాలు మొహంమీద కప్పుకున్నాడు.

'జోగయ్యా నీ ఆపరేషన్‌కి ఈ మూడు వేలూ అప్పుగా తీసుకో- నీ కొడుకుని లాక్కునేంత కసాయివాడినికాను నీకు జబ్బు తగ్గాక తిరుద్దువు గాని. రోగిష్టివాడివి కొడుకు ఆసరా నీకెంతైనా అవసరం'-

'అప్పుగా నేను తీసుకోను. వాడిని నువ్వు కొనుకున్నట్టే లెక్క అలాగయితేనే నాకు మూడువేలియ్యి'- రాయిలా ఉంది జోగయ్య మొహం.

రాఘవులికి కోపం వచ్చింది.

'నీ మంచికోసం చెప్తుంటే ఏమిటి మొండితనం. సరే అయితే నేను చెప్పేదికూడ విను. వీడిని నిజంగానే నా కమ్మినట్టయితే నువ్వీ వూళ్లొంచి తక్షణమే వెళ్లిపో. నువ్విక్కడుంటే వీడు నా కొడుకెలా అవుతాడు. అయినా వీడిని నేను కొడుకుగానే చూడాలనేముంది. పశువులా చాకిరి చేయిస్తాను.'

'నీ యిష్టం'- జోగయ్య నెమ్మదిగా లేచాడు.

అదేదో అద్భుతం చూస్తున్నట్టున్న జనంలో అప్పుడే కదలిక మొదలై దారి తప్పుకున్నారు.

ఒక్కుమ్మడిగా జోగయ్య మొహంమీదే తిట్టడం మొదలెట్టారు. జోగయ్య అదేం పట్టించుకోకుండా ముందుకు పోయాడు.

'నాన్నా' గుండె పగిలేలా ఏడుస్తున్న చిన్నిగాడి ఏడుపుగానీ, రాఘవులి గద్దింపు గాని అతన్నాపలేకపోయాయి. పూనకం వచ్చిన వాడిలా నడుస్తున్న జోగయ్యను నాగవల్లి నిలేసింది.

'నీ కిదేం పోయే కాల మొచ్చింది జోగయ్యా! కొడుకును నీ ప్రాణం కోసం అమ్ముకుంటావా?' పురుగులు పడపోతావు. అడుక్కుని అయినా బిడ్డను పెంచుకోవచ్చు. నీకు పుట్టగతులుండవు.'

'అద్సులే'

'ఛీ! నువ్వు మనిషివి కావు.'

'ఏవయ్యా నువ్విక్కడ కునికిపాట్లు పడుతున్నావా? డాక్టరుగారు వెళ్లిపోయే టయిమయింది. త్వరగా లోపలికెళ్లు'- కాంపౌండరు జోగయ్యను కసిరేసరికి గబగబా లోపలికి నడిచాడు జోగయ్య.

'నువ్వా జోగయ్యా! డబ్బు తెచ్చావా? ఆపరేషన్ ఆలస్యమయినకొద్దీ ప్రాణానికే ముప్పు.'

జోగయ్యను బాగా ఎరిగివున్న డాక్టర్ పరాంకుశం హెచ్చరిస్తున్నట్టు అన్నాడు. జోగయ్య వెంటనే ఏం మాట్లాడలేదు.

'అదేం మళ్లీ నొప్పి ఉధృతంగా వచ్చిందా? అలా వున్నావు? డబ్బు దొరకలేదా? నా దగ్గర పూర్తి ఎక్విప్‌మెంటు లేదయ్యా. లేకపోతే ఊరికినే చేద్దును. పోనీ నా ఫీజు ఇవ్వకు. డాక్టర్ కృష్ణతో

మాట్లాడతాను. వాళ్ల నర్సింగ్‌హోంలో ఆపరేషన్‌కి అంతా సిద్ధం చెయ్యమని.'

పరాంకుశం జోగయ్య గ్రామంలో పుట్టి పెరిగినవాడు. చదువుకునే రోజుల్లో పట్నం వచ్చినపుడల్లా తన కోసం జున్నూ, స్వీట్లు తెచ్చే జోగయ్యంటే పరాంకుశానికి అభిమానం.

మూడు వేలు తెచ్చాను డాక్టర్ బాబూ!'-ఎలాగో గొంతు పెగిలింది జోగయ్యకి.

'అయితే ఇకనేం రేపే ఆపరేషన్‌కి సిద్ధం చేయిస్తాను.'

'బాబూ ఆపరేషన్ చేస్తే నా జబ్బు నిజంగా తగ్గుతుందా? నా కళ్లలోకి చూసి నిజం చెప్పండి బాబూ. మిమ్మల్ని చిన్నప్పట్నుంచి ఎరుగుదును.'

'జోగయ్యా! ఎందుకు అలా అనుకుంటున్నావు.'-తడబడింది డాక్టర్ గొంతు.

'మొన్న మీరు నేను వెళ్లిపోయాక ఇంకో డాక్టర్ బాబుతో అంటున్న మాటలు విన్నాను బాబూ!'

డాక్టర్ తలవంచుకున్నాడు.

'మూడు వేలూ తెచ్చాను బాబూ. ఎలాగో తెలుసా! నా చిన్నిగాడిని అమ్మిన సొమ్ము బాబూ ఇది.'

'జోగయ్యా'

'నన్ను చూస్తే అసహ్యంగా వుంది కదూ!' జోగయ్య గొంతు రుద్ధమైంది.'- కానీ ఇది ఆపరేషన్ కోసం తేలేదు డాక్టర్ బాబూ!

కాస్త సర్దుకున్న పరాంకుశం అన్నాడు ఓదార్పుగా-

'జోగయ్యా! ఆపరేషన్ చేసినా తగ్గదని ఎందుకనుకుంటున్నావు. చాలవరకు కేసు సక్సెస్ అయ్యే అవకాశాలున్నాయి. ఎలాగైనా నిన్ను బ్రతికించుకునే పూచీ నాది.'

'మీ సామర్థ్యం నాకు తెలుసు బాబూ. కానీ నా కొడుకుని అమ్ముకున్న డబ్బుతో...... వద్దు. రాత్రుళ్లు లుంగజుట్టుకుపోతూంటే నాకే తెలుస్తోంది నే నెంతోకాలం బ్రతకనని. నా కొక్కసాయం చేయమని కోరేందుకు వచ్చాను బాబూ!'

'ఏమిటి?' –

'మీరంటే నాకెంతో నమ్మకం. ఈ డబ్బు మీ దగ్గర దాచండి. నా బిడ్డను రాఘవులకి అమ్ముతుంటే ఊరంతా నన్నసహ్యించుకుంది. కానీ రాఘవులికి పిల్లల్లేరు. చిన్నిని ప్రాణంలా చూసుకుంటాడని తెలుసు. అయితే చేతులారా కన్నకొడుకు బంధాన్ని తెంచుకోలేక నాటకమాడి చిన్నిని అమ్మేసి నాకూ వాడికీ ఏ బంధమూ లేదని నా మనసుని తృప్తి పరచుకున్నాను. నేను చచ్చిపోతే – తల్లి కూడ లేని వాడిని మామూలుగా అయితే ఎవరూ ఆదుకోరు. నౌకరులా ఉపయోగించుకుంటారు. అందుకే ఒక హక్కు కలగాలనే అమ్మేసాను. కానీ పెద్దయ్యాక ఈ డబ్బు వాడికిస్తూ చెప్పండి బాబూ 'మీ నాన్న కసాయివాడు కాదురా' అని. అప్పుడుగానీ నా ఆత్మశాంతించదు. ఇప్పుడే తెలిస్తే వాడు రాఘవులి దగ్గర ఉండడు. అందుకే నా మీద కోపంతోనైనా చిన్ని నన్ను మర్చిపోవాలని....'






డబ్బు సంచీ వణుకుతున్న చేతులతో డాక్టర్ బల్లపైపెట్టి వడివడిగా వెళ్లిపోయాడు జోగయ్య.

అదేరోజు రాత్రి సత్రం అరుగు మీద నొప్పితో విలవిల్లాడుతూ ఆఖరి క్షణంలో అనుకున్నాడు జోగయ్య –

'చిన్ని! ఇంత నొప్పి నీ చల్లని చిన్న చెయ్యి పడితే ఉపశమిస్తుందని తెలుసురా. కానీ నా స్వార్థం కోసం నిన్ను అనాధను చెయ్యలేక .... అబ్బా... నాన్నను క్షమిస్తావు కదూ!'

ఒకే ఒక్క అశ్రుకణం కనుకొలకుల నుంచి సానుభూతిగా రాలి పడింది – జోగయ్యను ఒంటరివాడిని చేసి – □